క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నరసరావుపేటటౌన్: విద్యుత్ సబ్ స్టేషన్‌ల మరమ్మతుల కారణంగా శనివారం పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.ఎల్.వి. ప్రసాదరావు శుక్రవారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పట్టణ, రూరల్ పరిధిలో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. విషయాన్ని గమనించి వినియోగదారులు సహకరించాలని కోరారు.

సౌత్‌జోన్ క్రీడా పోటీలకు ముప్పాళ్ల విద్యార్థులు

ఈపూరు (శావల్యాపురం): మండలంలోని ముప్పాళ్ళ గ్రామం ధనలక్ష్మి వ్యాయామ కళాశాలకు చెందిన విద్యార్థి సెకండ్ బి.పి.ఇడి. ఆర్.వెంకట్రామయ్య ఈనెల 22 నుంచి ఎస్ఆర్ఎం యూనివర్సిటీ చెన్నైలో జరగనున్న అంతర్ విశ్వవిద్యాలయం స్విమ్మింగ్ పోటీలకు నాగార్జున విశ్వవిద్యాలయ జట్టుకు ప్రాతినిధ్యం వహించుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు చుండు వెంకటరావు శుక్రవారం తెలిపారు. ఈ పోటీలు డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫి జోనల్ ఎడ్యుకేషనల్ ఆచార్య నాగార్జున యూనివర్సిటీ టీం ఆధ్వర్యంలో గుంటూరులో ఎంపిక జరిగినట్లు తెలిపారు. అలాగే ఇదే కళాశాలకు చెందిన ఎస్‌కె.ఇర్ఫాన్ ప్రథమ బి.పి.ఇడి.విద్యార్థి నాగార్జున విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫుట్‌బాల్ అంతర్ కళాశాలలో పోటీల్లో పాల్గొని ఈనెల 21 నుంచి కాలికట్ యూనివర్సిటీ కేరళలో జరుగే సౌత్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల పోటీలకు పాల్గొని నాగార్జున విశ్వవిద్యాలయం జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఎంపికైనా విద్యార్థులను కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ మేదరమెట్ల రామశేషగిరి అధ్యాపకులు నాయక్, అరవింద్, దాసు, వంశీలు ప్రత్యేకంగా అభినందించారు.

గ్రామ సభకు 36 అర్జీలు

నాదెండ్ల: గొరిజవోలు గ్రామ సచివాలయం వద్ద రెవెన్యూ గ్రామ సభ శుక్రవారం నిర్వహించారు. తహసీల్దార్ ఏవీ రమణ అధ్యక్షతన జరిగిన సభలో రైతుల నుంచి 36 అర్జీలు అందాయి. డిప్యూటీ తహసీల్దార్ ధనలక్ష్మి, మండల సర్వేయర్ రాంబాబు, గ్రామ రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు హాజరయ్యారు. రీసర్వేలో భూముల కొలతల్లో తేడాలను సరిచేయాలంటూ, పాసు పుస్తకాలు కావాలంటూ అర్జీలు అందించారు.

ఘనంగా హనుమత్ వ్రతం

యడ్లపాడు: మండలంలోని బోయపాలెం జాతీయ రహదారి పక్కనే వేంచేసి ఉన్న శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయం శుక్రవారం భక్తులతో కళకళలాడింది. ఆలయంలో గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు 20వ హనుమత్ వ్రతం కొనసాగింది. గ్రామంలోని దంపతులు అధిక సంఖ్యలో పాల్గొని సుదర్శన హోమంలో భాగస్వాములు అయ్యారు. ఈ సందర్భంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచన, మండపారాధన, నవగ్రహ పూజ, నాగవల్లీ దళార్చన, కదాళీ ఫలాలతో సహస్ర నామార్చన గావించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేశారు.

జేఈఈలో ర్యాంకర్‌కు అభినందనలు

నాదెండ్ల: గణపవరం గ్రామానికి చెందిన కాటా హర్షితకు డాక్టర్ గోగినేని హరిప్రసాదరావు స్మారక స్కాలర్‌షిప్ లభించింది. తెనాలి కొత్తపేటలోని డాక్టర్ హరిప్రసాదరావు స్మారక ఆసుపత్రిలో ఈ స్కాలర్‌షిప్‌ను స్వీకరించారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర చేతులమీదుగా జ్ఞాపిక, రూ.1లక్ష నగదును తల్లిదండ్రులు హరిబాబు, విజయలక్ష్మీ కుమార్తె హర్షితతో కలిసి అందుకున్నారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన హర్షిత ఈ ఏడాది జరిగిన జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో జాతీయస్థాయిలో 43 ర్యాంక్‌ను మెయిన్స్‌లో 50వ ర్యాంక్ కైవసం చేసుకున్న విషయం విదితమే. ఇదికాకుండా తెలంగాణ రాష్ట్రంలో 15వ ర్యాంక్ సాధించింది. ఇంటర్ బైపీసీ ఫలితాల్లో 973/1000 సాధించింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని హర్షితకు గణపవరం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కెల్లంపల్లి సుందరరావు, జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు, కాటా సూరయ్య, కాటా రత్తయ్య, కాటా వెంకటేశ్వర్లు, గ్రామ పెద్దలు అభినందించారు.

తాపీ మేస్త్రీ అదృశ్యం

నరసరావుపేట రూరల్: పనికి వెళ్లిన తాపీ మేస్త్రీ తిరిగి రాకపోవడంతో అతని కుమారుడు అజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. మండలంలోని ములకలూరు గ్రామానికి చెందిన వినుకొండ నాగశ్వరరావు తాపీ మేస్త్రీగా పని చేస్తున్నాడు. ఈనెల 10వ తేదీ పనికోసం ఇంటి నుంచి వెళ్లిన నాగేశ్వరరావు తిరిగి రాలేదు. నాగేశ్వరరావు ఆచూకీ కోసం గాలించినా లభించకపోవడంతో అజయ్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కిశోర్ తెలిపారు.

విద్యుత్ చార్జీల పెంపు అన్యాయం

చిలకలూరిపేట: ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక విద్యుత్ చార్జీలు పెంచడం అన్యాయమని సీపీఎం పట్టణ కన్వీనర్ పేరుబోయిన వెంకటేశ్వర్లు విమర్శించారు. పెంచిన విద్యుత్ చార్జీలు, ట్రూ అప్ చార్జీలకు నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్ఆర్‌టీ సెంటర్లో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. పెరిగిన అదనపు చార్జీలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

చకచకా ఆక్రమణల తొలగింపు

వినుకొండ రోడ్డుకు చేరిన కార్యక్రమం

నరసరావుపేట: జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలో రోజు రోజుకు జనాభా పెరిగిపోతుంది. దీనికి తగ్గట్లుగా ద్విచక్ర, నాలుగుచక్రాల వాహనాలు పెరుగుతున్నాయి. అంతేగాకుండా పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు కోసం బస్సులు, కళాశాలల బస్సులు విపరీతంగా పెరిగాయి. జనాభా 2011 లెక్కల ప్రకారం 1.19 లక్షల మంది ఉంటే ఇప్పుడు ఆ సంఖ్య 1.60 లక్షలకు చేరింది. అపార్టుమెంట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. వాణిజ్య సముదాయాలు పెరిగాయి. ప్రతిరోజూ సుమారు 30 వేలమంది విద్యార్థులు ఎల్‌కేజీ నుంచి ఇంజినీరింగ్ విద్యాలయాలకు వెళ్లివస్తుంటారు. దీంతో పాటు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పురపాలక పరిధిలోకి చుట్టుప్రక్కల నుంచి ఐదు గ్రామాలను విలీనం చేయటం జరిగింది. ఈ నేపథ్యంలో జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి ప్రజల రాకపోకలు పెరిగాయి. పల్నాడురోడ్డు, వినుకొండరోడ్డు, గుంటూరురోడ్డు, సత్తెనపల్లిరోడ్లు చాలా విశాలమైనవి. మాస్టర్ ప్లాన్‌లో భాగంగా వీటిని పూర్వకాలం నుంచే 100 అడుగుల నుంచి 120 అడుగల వరకు ఏర్పాటు చేశారు. అయితే అధికంగా జనసంచారం లేని సమయంలో రోడ్ల మార్జిన్లను ఆక్రమించి నిర్మాణాలు చేసినా, తోపుడు బండ్లు, వాణిజ్య సముదాయాలు ఏర్పాటు చేసినా పెద్దగా పట్టించుకోలేదు. ఇప్పుడు పరిస్థితి మారింది. జిల్లా కేంద్రం కావటంతో రోడ్లకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. జిల్లా కలెక్టర్, ఎస్పీ, జిల్లా న్యాయమూర్తి, ఇతర జిల్లా అధికారులు నిత్యం రాకపోకలు సాగించే పరిస్థితి ఉండటంతో రోడ్లపై ఉన్న ఆక్రమణలు తొలగించాల్సిన నేపథ్యం ఏర్పడింది. ఈ విధమైన పరిస్థితుల్లో ప్రధానమైన రోడ్ల మార్జిన్లు, డ్రెయిన్లు ఆక్రమించి ఏర్పాటుచేసిన దుకాణాలు, ఇతర కట్టడాల తొలగింపు అత్యావశ్యకమైంది. మూడురోజులుగా వినుకొండరోడ్డులో ఆక్రమణల తొలగింపు మొదలు పెట్టారు. ప్రకాష్‌నగర్ మల్లమ్మ సెంటర్ ఫై ఓవర్, బిలాల్, హార్డు కాంపౌండ్ ఎదురుగా జేసీబీ సహాయంతో ఆక్రమణలు తొలగించారు. తొలుత మెయిన్ రోడ్లపై నున్న ఆక్రమణలను తొలగిస్తున్నారు. అలాగే


ప్రకాష్‌నగర్ హర్డుకాంపౌండ్‌కు ఎదురు రోడ్డులో ఆక్రమణలు తొలగిస్తున్న జేసీబీ

బుధవారం రోజున అరండల్‌పేటలోని పాత ఏంజెల్ టాకీసు సమీపంలోని ఆక్రమణలను తొలిగించామని టీపీవో సాంబయ్య వెల్లడించారు. ఈ తొలగింపులు పార్టీలకు అతీతంగా జరగాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. కాగా, ఆర్టీసీ బస్టాండ్ గ్యారేజ్, డీమార్టు, వినుకొండ రోడ్డులోని జూపల్లి సెంటర్, నవయుగ సెంటర్లలో అధికంగా ఆక్రమణలు ఉన్నాయి. రోడ్డుకిరువైపులా మార్జిన్లను ఆక్రమించి కొందరు దుకాణాలు నిర్మించి నెలవారీ అద్దెలు వసూలుచేసుకుంటున్నారు. వీటిలో అధికంగా అధికార పార్టీ వారికి చెందినవే ఉన్నాయి. వీటి తొలగింపులో అధికారుల చిత్తశుద్ధి బయటపడుతుందని కొందరు పౌరుల వ్యాఖ్యానిస్తున్నారు.


ఆక్రమణలు తొలగిస్తుంది ఇలా....

ఆక్రమణలు తొలగించాలి



డ్రెయిన్లపై ఉన్న ఆక్రమణలు తొలగించి వాటిలో పూడిక తీసి శుభ్రం చేయటం వలన వర్షం పడిన సమయంలో నీటి పారుదలకు ఎక్కడా అవంతరాలు లేకుండా ఉంటుంది. నీరు నిలబడి దోమలు పెరిగే అవకాశం ఉండదు. తద్వారా ప్రజలకు రోగాలు రాకుండా ఉంటాయి, దుర్వాసన తగ్గుతుంది.

–బత్తుల చంద్రశేఖర్, అరండల్‌పేట

అన్నింటినీ తొలగించాలి



ఆక్రమణల తొలగింపు చేపట్టారు. సంతోషం. అయితే పార్టీలకు అతీతంగా చిన్నా, పెద్దా తేడాలేకుండా తొలగించాలి. అప్పుడే చేపట్టిన కార్యక్రమానికి సార్ధకత ఏర్పడుతుంది. అధికార పార్టీవారివి చాలా ఉన్నాయి. వాటిని పట్టించుకోకుండా మిగిలిన వారివి తొలగిస్తే ప్రజలు తిరగబడే ప్రమాదం ఉంది.

–పాలపర్తి వెంకటేశ్వరరావు, మాజీ కౌన్సిలర్

అప్పాపురంలో రెవెన్యూ సదస్సు

- ఆగ్రహారం భూముల రైతులకు న్యాయం చేయండి సారూ
- 2000 వేల ఎకరాలు 700 మంది రైతులు అభ్యర్థన

వినుకొండ (నూజెండ్ల): మండలంలోని అప్పాపురం గ్రామంలో రెవెన్యూ సదస్సు శుక్రవారం నిర్వహించారు. గ్రామపరిధిలో ఉన్న అగ్రహారం భూములు రెండు వేల ఎకరాలు ఉండగా అందులో 700 మంది రైతులు అనుభవంలో ఉన్నారు. ప్రభుత్వపరంగా భూములపై హక్కు కల్పించాలని రైతులందరు లిఖిత పూర్వకంగా డిప్యూటీ తహసీల్దారు కె.బాల వెంకటేశ్‌కు వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సూచనలు మేరకు రెవెన్యూ అధికారులు అగ్రహారం భూముల సర్వే పనులు పూర్తి చేసి ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ఫాం–6లు నోటీసులు రైతులకు అందజేసియున్నారు. అగ్రహారం భూములు కావటం చేత బ్యాంకు నుంచి రుణాలు పొందలేకపోతున్నామని, అమ్ముకునేందుకు వీలులేకుండా పోయిందని ప్రభుత్వ పథకాలు కోల్పోయినట్లు రైతులు వాపోయారు. ఈసందర్భంగా తహసీల్దారు ఆర్.రమేష్‌కుమార్‌ను వివరణ కోరగా అగ్రహారం భూములకు సంబంధించి పూర్వీకులను గుర్తించి క్షేత్రస్థాయిలో విచారణ చేసి అర్హులైన రైతులకు న్యాయం చేస్తామన్నారు.


డిప్యూటీ తహసీల్దారు బాల వెంకటేశ్‌కు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

రెవెన్యూ సదస్సుకు ఆరు దరఖాస్తులు

రొంపిచర్ల: అరేపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభకు ఆరు అర్జీలు అందాయని తహసీల్దార్ బండి నిర్మల తెలిపారు. తమ పొలాలను ఆన్‌లైన్ అడంగల్‌లో నమోదు చేయా లని నలుగురు రైతులు దరఖాస్తు చేసుకోగా, మరో ఇద్దరు భూములను సర్వే చేయించాలని దరఖాస్తులు అందాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కోటేశ్వరరావు, మండల సర్వేయర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

విధివంచితులకు సాయం భగవంతుడి సేవతో సమానం

- ఇన్నర్‌వీల్‌క్లబ్ అధ్యక్షురాలు గట్టు సరోజిని
- క్లబ్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు
- పలువురికి నూతన వస్త్రాల పంపిణీ

యడ్లపాడు: విధివంచితులను సాయం అందించడం భగవంతుడికి సేవ చేయడంతో సమానమని చిలకలూరిపేట విద్యాసంఘం కార్యదర్శి మైలవరపు శివానందరావు, భువనేశ్వరి దంపతులు చెప్పారు. యడ్లపాడు మండలం చెంఘిజ్‌ఖాన్‌పేట పంచాయతీలోని బున్నీనగర్‌లో శుక్రవారం సెమీక్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రముఖ వైద్యులు గట్టు రంగారావు సహకారంతో ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో స్థానిక చర్చి పాస్టర్ కృష్ణ క్రీస్తు గీతాలను ఆలపించి, బైబిల్ సందేశాన్ని వినిపించారు.


చీరెలు పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

ఈ సందర్భంగా ఇన్నవర్‌వీల్ క్లబ్ అధ్యక్షులు గట్టు సరోజిని మాట్లాడుతూ ప్రతి ఏడాది తమ క్లబ్ ఆధ్వర్యంలో కాలనీలోని 51 లెప్రసీ కుటుంబాలకు నూతన వస్త్రాల పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తుందన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి నార్నే జయలక్ష్మి, పాస్ట్ ప్రెసిడెంట్ తియ్యగూర రమాదేవి, కరణం విజయ పాల్గొన్నారు.

లక్ష్యాల సాధనకు శిక్షణ దోహదం కావాలి

ఎంపీడీవో హేమలతాదేవి

యడ్లపాడు: సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికరణ సాధనకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఎంపీడీవో హేమలతాదేవి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ముగింపు సమావేశంలో ఎంపీడీవో హేమలతాదేవి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం ఐక్యరాజ్యసమితి సూచించిన పది కీలక సమస్యలపై అందరూ దృష్టి సారించాలన్నారు. అలాగే స్థానిక వనరుల కల్పనకు సమన్వయ సహకారం ఎంతో అవసరమన్న విషయాన్ని గుర్తించి పల్లెల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో జిల్లాపరిషత్ డీపీఆర్సీ ప్రతినిధిగా సింహాద్రి నిరంజన్‌రావు, గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న హేమలతాదేవి

ముగిసిన శిక్షణ తరగతులు

శావల్యాపురం: సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను అధిగమించటానికి అధికారులు తప్పనిసరిగా బాధ్యత వహించాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నాల్గవరోజు సచివాలయ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలకు ముగింపు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో సీతారామయ్య మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలు మేరకు గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. ప్రతి ఒక్కరు విద్యతో పాటు మంచి ఆరోగ్యాన్ని కల్గి ఉండేలా అన్నీ శాఖల అధికారులు సమన్వయంతో తమ విధులు అంకిత భావంతో నిర్వహించాలన్నారు. అనంతరం అన్నీ శాఖల అధికారులచే సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై ప్రతిజ్ఞ చేయించి గ్రూపు ఫొటో దిగారు ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డి పి.సుగుణ, ఏపీయం జి.వాసుబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజరు కుప్పం శ్రీలత, అలవలపూడి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.


శిక్షణ తరగతుల్లో పాల్గొన్న మండల స్థాయి అధికారులు సచివాలయ సిబ్బంది

నేడు పుస్తకావిష్కరణ కార్యక్రమం

వినుకొండ (నూజెండ్ల): రావులపల్లి పుల్లారావు వృత్తిరీత్యా ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు. ఆయన తన ఆలోచనలను భావాలను పుస్తక రూపంలో కలుద్దాం పదా అంటూ నిత్యం విద్యార్థులతో పాటు సామాన్యులను సైతం ఆలోచించే విధంగా చేయటమే ఆయన లక్ష్యం. నూజెండ్ల మండలం పాతరెడ్డిపాలెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో తోటి ఉపాధ్యాయులు మాదిరిగానే పాఠశాలకు సమయానికి రావటం విద్యార్థులకు పాఠాలు భోదించటమే కాకుండా తాను సంపాదించిన జ్ఞానాన్ని విద్యార్థులకు అందించి వారిని ఉన్నత స్థాయిలో నిలిచేలా తపన పడే వ్యక్తి. ఖాళీ సమయాల్లో శ్రమ అనుకోకుండా విద్యార్థులకు పరీక్షల్లో మెలకువలు, జీవితంలో ఉన్నతస్థాయిలో నిలవాలంటే వెళ్లాల్సిన మార్గాలను మోటివేషన్ క్లాసులు ద్వారా తనదైనారీతిలో బోధించుతున్నారు. జ్ఞాన ఆసక్తిని పదిమందికి పంచాలనే వాటిని అక్షర రూపంలో ముద్రించి విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు అందజేస్తారు.

ఉదయం పది గంటలకు....

నేడు వినుకొండ పట్టణంలోని గంగినేని కల్యాణ మండపంలో మిస్టర్ రావు పుస్తకావిష్కరణ కార్యక్రమం ఉదయం 10 గంటలకు జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్ విప్ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మోటివేషనల్ స్పీకర్ సినీ నటులు కె.వి.ప్రదీప్ చేతుల మీదుగా పుస్తకావిష్కరణ జరుగుతుందని విలేకర్ల సమావేశంలో రావులపల్లి పుల్లారావు తెలిపారు.

సింహగర్జనకు తరలిరండి

వినుకొండ(నూజెండ్ల): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 15వ తారీకున గుంటూరులోని హౌసింగ్ బోర్డు కాలనీ దగ్గర మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో మాలల సింహగర్జన సభ జరుగుతుందని మాలల ఐక్యవేదిక జేఏసీ కన్వీనర్ లూథర్ పిలుపునిచ్చారు. స్థానిక నరసరావుపేట రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్గీకరణ వల్ల అత్యధికంగా నష్టపోయేది మాల, మాదిగలు మాత్రమేనని తెలిపారు. కార్యక్రమంలో బ్రహ్మం, బాలు, మాణిక్యరావు, చిట్టిబాబు, పి. భూషణ్, డి.భూషణ్, కొండలు, జంగా శ్రీను, ఆనంద్, చిరంజీవి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కాలువలో పడి వ్యక్తి మృతి

వినుకొండ(నూజెండ్ల): ప్రమాదవశాత్తు కాలువలో పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన వినుకొండ రూరల్ మండలం చాట్రగడ్డపాడు సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నూజెండ్ల మండలం పమిడిపాడు గ్రామానికి చెందిన రాచకొండ శ్రీను (55) వ్యక్తిగత పనులపై వినుకొండకు వచ్చి ఇంటికి వెళ్తూ మార్గమధ్యంలో ద్విచక్ర వాహనంపై వస్తుండగా కళ్లు తిరుగుతుండటంతో సమీపంలో ఉన్న ఎన్ఎస్‌పీ కాలువ దిమ్మెపై కూర్చున్నాడు. కొంత సమయం తరువాత వెనుకకు కాలువలో పడిపోవడంతో మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

యువశక్తిని దేశ నిర్మాణానికి ఉపయోగించాలి

- ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు
- ఉత్సాహంగా యువ ఉత్సవ్

నరసరావుపేట రూరల్: యువశక్తిని దేశ నిర్మాణానికి ఉపయోగిస్తే భారతదేశం ప్రపంచంలో అగ్రగామిగా నిలుస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు తెలిపారు. నరసరావుపేట ఫార్మస్యూటికల్ సైన్సెస్ కాలేజీ, నెహ్రూ యువకేంద్రం, ఎడుకేట్ ది సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యువ ఉత్సవ్ శుక్రవారం నిర్వహించారు. భారత్ 2047 థీమ్‌తో పెయింటింగ్, రైటింగ్, మొబైల్ ఫొటోగ్రఫీ ఉపన్యాస, సైన్స్ మేళా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పోటీలలో పాల్గొన్నారు. పోటీల ప్రారంభ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, నెహ్రూ యువ కేంద్ర అధికారి దేవిరెడ్డి కిరణ్మయి, కళాశాల కార్యదర్శి మిట్టపల్లి రమేష్‌లు పాల్గొన్నారు. స్వామి వివేకానంద చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతితో పాటు మెడల్స్, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జేఎన్ సురేష్ కుమార్, షేక్ అన్సారీ పాల్గొన్నారు.


విద్యార్థులతో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

సత్తా చాటిన డీఆర్ఎన్ కళాశాల విద్యార్థులు

చిలకలూరిపేటటౌన్: క్రీడాకారులు ఓటమిని గెలుపునకు సోపానాలుగా మలుచుకున్నప్పుడే భారతదేశ కీర్తిని అంతర్జాతీయస్థాయిలో చాటే అవకాశం ఉంటుందని డీఆర్ఎన్ఎస్‌సీవీఎస్ కళాశాల అధ్యక్షులు తేళ్ళ సుబ్బారావు చెప్పారు. నెట్‌బాల్ మెన్ టోర్నమెంట్‌లో విజయం సాధించిన కళాశాల విద్యార్థులను అధ్యపకులు అభినందించారు. ఉత్కంఠ భరితంగా సాగిన ఈ టోర్నమెంట్‌లో యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల విన్నర్స్‌గా నిలిచి ట్రోఫీని చేసుకోగా, రన్నర్స్‌గా డీఆర్ఎన్ఎస్‌సీవీఎస్ జట్టు విజయం సాధించిందన్నారు. విజేతలను అభినందించిన వారిలో కళాశాల ఉపాధ్యక్షులు డాక్టర్ కందిమళ్ళ సాంబశివరావు, సెక్రటరీ మైలవరపు శివానంద్ కుమార్, ట్రెజరర్ బచ్చు రామలింగేశ్వర రావు, జాయింట్ సెక్రటరీ బేతంచెర్ల రామకోటేశ్వరరావు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సి.హెచ్.వెంకన్న రావు పీడీ ప్రవీణ్ అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.


ద్వితీయ స్థానంలో నిలిచిన డీఆర్ఎన్ కళాశాల విద్యార్థులు

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు ఉప్పలపాడు విద్యార్థి

నరసరావుపేట రూరల్: రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు ఉప్పలపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థి ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. పాఠశాల పదవ తరగతి విద్యార్థి టి.వెంకట కల్యాణ్ ఈనెల 6వ తేదీన భారతీయ విజ్ఞాన్ మండలి నిర్వహించిన జిల్లాస్థాయి క్విజ్ పోటీలలో ద్వితీయస్థానం సాధించినట్టు తెలిపారు. విజయవాడలో ఈనెల 29,30 తేదీలలో విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో కల్యాణ్ పాల్గొంటాడని వివరించారు. క్విజ్ పోటీలలో ప్రతిభ కనబర్చిన కల్యాణ్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాసరావు, సైన్స్ ఉపాధ్యాయులు ఏపీ మధుకుమార్, జి.సుధాకరరెడ్డి అభినందించారు.


కల్యాణ్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నేడు నీటి సంఘాల ఎన్నికలు

సరైన సమాచారం లేక రైతుల్లో అయోమయం

నాదెండ్ల: నేడు జరగవలసిన నీటి సంఘాల ఎన్నికలపై ఆయకట్టుదారులకు సరైన సమాచారం లేకపోవటంతో అయోమయం నెలకొంది. నాదెండ్ల మండల పరిధిలో 10 నీటి సంఘాలుండగా, ఏ ఒక్క సంఘానికి కూడా ఇంతవరకూ ఆయకట్టుదారుల ఓటర్ల జాబితా నేటి వరకూ చేరలేదు. పోటీచేయదలచుకున్న టీసీలు తమ పేరిట ఉన్న నీటి తీరువా బకాయిలను పూర్తిగా చెల్లించాల్సి ఉంది. ఈ మేరకు అధికారులు కౌంటర్లు ఏర్పాటు చేసి చెల్లింపులు స్వీకరించాలి. అయితే ఈ ఏర్పాట్లు చేయలేదు. ప్రస్తుతం ముమ్మరంగా వ్యవసాయ పనులు సాగుతున్న తరుణంలో ఎన్నికలపై అధికారులు ఎలాంటి ప్రచారం చేయకపోవటంతో ఎన్నికల్లో రైతుల భాగస్వామ్యంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ విషయమై జలవనరుల శాఖ ఏఈ నర్రా మురళీకృష్ణ వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఫోన్ అందుబాటులోకి రాలేదు.

పది సంఘాలకు...

నాదెండ్ల మండల పరిధిలో పది నీటి సంఘాలుండగా, నాదెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాలుగు సంఘాలకు, గణపవరం జెడ్పీ హైస్కూలు పాఠశాలలో రెండు సంఘాలకు, నాదెండ్ల ప్రాథమిక పాఠశాలలో రెండు సంఘాలకు, సాతులూరు జెడ్పీ హైస్కూలులో ఒక నీటి సంఘానికి, జొన్నలగడ్డలో ఒక నీటి సంఘానికి నిర్వహించనున్నారు.

బొల్లాపల్లి : మండలంలో నేడు జరగనున్న సాగు నీటి సంఘాల ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేశామని తహసీల్దార్ ఏవీ సుధాకర్ తెలిపారు. మండల పరిధిలోని ఏడు మైనర్, మూడు మేజర్ నీటి సంఘాలు ఉన్నాయని, మరో రెండు సంఘాల్లో మండలానికి చెందిన టీసీ సభ్యులు కొందరు ఎంపిక జరుగుతుందన్నారు.

డాక్టరయ్యా.. ధన్యవాదాలయ్యా..


మానవులే కాదు నోరు లేని పశువులు కూడా కృతజ్ఞతలు తెలుపుతాయా.. అంటే అవుననే చెప్పుకోవాలి. కొద్దిరోజులుగా కర్లకుంటలో గ్రామ రైతు సుబ్బారావుకు చెందిన ఆవు వైరల్ జ్వరం, కడుపు నొప్పితో బాధపడుతోంది. దానికి బాగా నీరసం ఆవహించింది. దీంతో పశువైద్యాధికారి డాక్టర్ సాయి మహేష్‌రెడ్డిని సంప్ర దించారు. ఆయన ఆవు పరిస్థితిని నిశితంగా గమనించి మూడు రోజుల పాటు ఆస్పత్రిలోనే ఉంచుకుని చక్కని వైద్య సేవలు అందించారు. జ్వరం, కడుపు నొప్పితో విలవిల్లాడిన ఆ ఆవుకు స్వాంతన లభించింది. శుక్రవారం మరోమారు పరిశీలన చేసేందుకు డాక్టర్ సాయి మహేష్ రెడ్డి ఆవు దగ్గరకు వెళ్లాడు. అప్పటి వరకు నీరసంగా పడుకొని ఉన్న ఆవు డాక్టర్‌ను చూసి అతికష్టం మీద పైకి లేచి డాక్టర్ భుజంపై తలపెట్టి నిమిరింది. దాని కంట నీరు రావడాన్ని గమనించిన వైద్యుడు తాను భావోద్వేగానికి గురయ్యారు. వీరిద్దర్నీ దూరం నుంచి చూస్తున్న రైతు కూడా ఒకింత ఆశ్చర్యానికి గురయ్యారు. మామూలు రోజు ల్లో ఈ ఆవు బయటి వ్యక్తులు దగ్గరికి వెళితే కట్టేసిన తాడును లాక్కోవటం, చిందులు వేయటం చేసేది. కానీ దగ్గర ఉండి చక్కగా వైద్యం చేసిన డాక్టర్ తనవద్దకు వస్తే లేని సత్తువ తెచ్చుకుని మరీ లేచి డాక్టర్ భుజంపై తలపెట్టి పరవశించడం స్థానికులనూ ఆశ్చర్యానికి గురి చేసింది. సదరు వైద్యుడు ఇప్పటికే తీవ్రమైన వ్యాధులతో బాధపడుతున్న ఆవులు, గేదెలు, గొర్రెలకు సర్జరీలు చేసి ప్రాణాలు నిలబెట్టారు. పశువుల ప్రాణాలు నిలబెట్టడానికే తాను ఈ వృత్తిని ఎంచుకున్నానని, వాటి నుంచి వచ్చే ఇలాంటి కృతజ్ఞత తనకు చాలని సెలవిచ్చారు డాక్టర్ సాయి మహేష్‌రెడ్డి.



– రొంపిచర్ల

లైట్ మోటార్ రంగ సమస్యల పరిష్కారానికి కృషి

చిలకలూరిపేట: లైట్‌మోటార్ రంగ కార్మికుల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. లైట్ మోటార్ ఓనర్స్‌అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జాతీయ రహదారిపక్కన విజయా బ్యాంక్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన జీపుల స్టాండ్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోనే పేరుగాంచిన జీపుల తయారీ చిలకలూరిపేటలో ఉన్నందున ఈ రంగంలో ఉన్న కార్మికులు, యజమానుల సమస్యలు తనకు బాగా తెలుసన్నారు. యూనియన్‌లో సొంతిల్లు లేని పేదలకు టిడ్కో గృహ సముదాయంలో ఇళ్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా జీపుల స్టాండ్‌లో యూనియన్ కార్యాలయ గది నిర్మించుకునేందుకు అనుమతి ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. యూనియన్ సభ్యులు తమ సమస్యలు లిఖిత పూర్వకంగా అందజేస్తే వాటిని పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నరసరావుపేట రూరల్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని ఉప్పలపాడు వద్ద శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు పల్లెపురంబు ఫహద్(20), అతని స్నేహితుడు విజయ్‌లు సంతమాగులూరు అడ్డరోడ్డు వద్ద జరిగిన వేడుకల్లో పాల్గొని ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా ఉప్పలపాడు వద్ద ఎదురుగా వచ్చిన కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఫహద్ అక్కడికక్కడే మృతిచెందాడు. విజయ్‌కు తీవ్రగాయాలు కావడంతో ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.